
# లక్షల్లో ఒకడు

## యండమూరి సత్యనారాయణరావు



"ఛీ ఛీ! ఎవడ్నడిగినా ఒకటే జవాబు. ఎదటి మనిషి బాధని గుర్తించలేని వెళ్ళందరూ ఎందుకు పుట్టార్రో...!"

"సరే! యిప్పుడెవడా జవాబు చెబ్తాడో చూస్తా!"

"ఎందుకైనా మంచిది ఎవడైనా ఉన్నాడేమో మళ్లీ అదే కూత కుయ్యడానికి" చుట్టూ చూసాను–పార్కులో నేను కూచున్న చోటు నించి కనుచూపు మేరలో ఎవరూలేరు. అందుకే ధైర్యంచేసి ఆ మాటలు గట్టిగా అన్నాను.

"నేను సమర్థుణ్ణికానా?"

"కావు, కావు" అరిచింది కాకి.

"ఛీ! వెధవ బ్రతుకు, చివరికి దీనిక్కూడ నేనంటే అలుసే."

అక్కడేఉన్న రాయి తీసి బలమంతా ఉపయోగించి దాని మీదకి విసిరాను. కాకికి తగల్టం కాదు సరికదా ఓ గజం దూరం నించి పోయిందా రాయి. ఒక్కసారిగా ఏడుపొచ్చేసింది. మళ్లీ చుట్టూ చూసి జంకుగా బీడీ, అగ్గిపెట్టె తీసాను.

"అగ్గిపుల్ల ఒకటేవుంది. దీంతో వెలుగుతుందో లేదో"

"వెల్లక్కపోతే, యింకెవరైనా నిప్పడిగి అంటించుకోడానికి యిదేమో బీడియాయె ఏడిసి..."

"నేనే సమర్థుణయితే ఈ బీడీ, ఒక అగ్గిపుల్లకే అంటుకొని తీరునుగాక!" గీసి బీడీ వెలిగించాను. నా ముఖం సంతోషంతో బీడీ లాగానే వెలిగింది.

"ఔను! నేనెట్లాగూ సమర్థుణ్ణే..."

"మరెట్లా నాన్నగారికా విషయం తెలిసేట్లు చేయడం."

"ఎట్లాగైనా తెలియాలి. లేకుంటే పొద్దుట అన్ని మాటలంటారా. నే నుత్తి వాజమ్మనట! నెత్తిన రెండ్రూపాయిలు బెట్టమ్మితే పైసాక్కూడా ఎవరూ కొన్రట నన్ను!"

"అక్కడికీ బి. ఏ. పాసయ్యానా లేదా. ఉద్యోగమిప్పించలేక నా పైనపడి ఒహటే గోల!"

"ఈ దరిద్రానికి తోడన్నట్లు, ఆ కిళ్లీకొట్టు వెధవ కూడా అప్పుడే రావాలా... థూ! థూ..."

చెయ్యి చురుక్కుమంది. బీడీ కింద పడేసాను.

"ఛీ! దీనికీ తెల్సు నేనేమీ చెయ్యలేనని!" పంటితో పెదాన్ని బిగపట్టి లేచాను.

"ఇప్పుడు యింటికెళ్తే మళ్లీ గొడవ! ఛీఛీఛీ! యిండియాలో పుట్టడమే బుద్ధి తక్కువ. వెధవ నిరుద్యోగపేడుపు! వెధవది తొందరగా చచ్చినా పీడా పోవును."

"హమ్మో... తీరా చచ్చాకా టీచరు పోస్టొస్తే...అందుకే యిప్పుడే చావకోడదు. అదేవొతుందో చూసుకొని చావాలి."

"చక్కగా ఆ టీచరు పోస్టే వస్తేనా... మొదట్నెల జీతం రాగానే యింట్లోంచి వెళ్లిపోయి, ఎక్కడైనా రూము తీసుకోవాలి. నా బతుకు నేనే బతుక్కోగల్నని నాన్నగారికి తెలియాలి."

"ఛా! ఛా! నాన్నగారికి మాత్రం నేనంటే ప్రేముండదా? ఏదో చికాకులో అట్లా అంటారే గానీ. కనుక యిహనించి నా జీతం కూడా నాన్నగారికిచ్చేసి చేదోడు వాదోడుగా ఉండాలి."

"అసలెంతో జీతం?...బహుశా..."

"అన్నయ్యా!" పిల్చాడురవి.

"అరరే! యిల్లుదాటొచ్చేస్తున్నానే!"

"ఎంట్రా ఆ అరుపు?" వాడికేసి విసుగ్గా చూస్తూ యింట్లోకి నడిచాను.

అయినా నే నట్లా ఆలోచన్లోపడి యిల్లు దాటి పోతూండటం, రవి పిలుస్తూండటం మా కలవాటే!

"వచ్చావా! నాయనా..." నాన్నగారు నన్ను చివాట్లేసిన రోజు అమ్మట్లా అడగడంకూడా అలవాటే!

"అయినా అమ్మక్కాకపోతే నేనెవరిక్కావాలిలే." మెల్లిగా నాగదిలోకి నడిచాను.

"ఛీ! ఎప్పుడైనా ఈ గది శుభ్రంగా ఉందా?"

"ఆహా! ఎందుకుండేదికాదు? ఇది నీ గదీ అని పేరు పడకముందు మా చక్కాహా ఉండేది" అంతరాత్మ జవాబు.

"ఓహో! ఈ అంతరాత్మొకటి. యిది లేకుంటే ఎంత హాయిగా ఉండును. దీనికి రావల్సినప్పుడొదుగా పౌరుషం!"

"అన్నానికి రారా బాబూ" అమ్మ పిలుపు.

"నే రాను" అరుద్దామనుకొన్నాను. కాని నాన్నగారొస్తే తిట్లతో నంజుకొని ఆ అన్నమంతా ఎట్లాగూ తినాలి. కనుక లేచాను.

"దేనికైనా అప్లికేషను పెట్టుకోరా నాన్నా!" అంది అమ్మ, తను ప్రస్తుతాన్కి కన్నీళ్లు పెట్టుకొంటూ.

"పెట్టుకొంటాను, నా తల్లీ సుకెళ్లి ఏ రైలుకిందో పెట్టుకొంటాను, నాన్నగారేమో ఎవరికీ చెప్పరు, దక్షిణామా యివ్వలేం. మరి ఈరోజుల్లో ఉద్యోగాలు కావాలంటే ఎక్కణ్ణించివస్తాయ్" నేనరవగల్గింది అమ్మమీదేనని నాకు బాగా తెల్సు.

"నాన్నగారొస్తున్నారోచ్!" బయట్నించి రేక రూపంలో నన్ను హెచ్చరించాడు రవి.

"నాన్నగారు వీధి మలుపులో ఉండగానే వాడట్లా అరవడం, నే చేస్తున్న పనట్లాగే వదిలి నా గదిలోకి దూరడం కూడా మా కలవాటే!"

"నే నేడవాల్సింది పోయి, నువ్వెందుకమ్మా బాధపడతావ్" అంటూ కంచడన్నాన్ని రెండు ముద్దల్లో మింగి, నా గదిలోకి దూరాను.

"ఈ వెధవ రాలే యింకా!" నాన్నగారు చెప్పులిప్పుతున్న శబ్దం.

"ఆ వెధవ నేనేనని తెల్సినా, రవేమో నన్న ఆశ!"

"ఎందుకండీ వాణ్ణి ఊరికా అట్లా తిడతారు" అమ్మ కంఠంలో అరుదుగా కనిపించే కోపం.

"ఆ చవలాయికి నీ సపోర్టొకటి." అమ్మ కోపానికి దడిసే నాన్నగారు ప్రస్తుతానికి నన్నాకోటాతో వదిలేసి వంటింట్లోకినడిచారు.

"ప్చ్! వెధవట వెధవ! అసలీమాట కనిపెట్టిన వెధవెవడో! నా కోసమే ఆ మాట పుట్టినట్లు, ఎవరు పిలిచిన అదే మాటతోనే గదా! ఛీ! ఛీ! రఘూ అని నాకో చక్కని పేరుందని,దాంతోపిలిస్తే లోకాలేవీ మునగవనీ వీళ్లకెట్లా తెలుస్తుంది. ఇహ ఈ బతుకు మొత్తానికి వెధవనేనేమో! అసలింతవరకు ఎవరైనా పిల్చారా నన్ను రఘూ అని!"

"ఆఁ! సుమ పిల్చేది చక్కగా, రఘూ అని"

"ఔను ఐదో క్లాసులోనే నయం! సుమైనా ఉండేది చక్కగా మాట్లాడుకోటానికి!"

"నువ్వు మంచోడివి రఘూ! రామేమో ఉత్తి అల్లరి వాడు. నువ్వు హోం వర్కు చెయ్యకులే! నీకివ్వాళ జొరమొచ్చేసిందని మా నాన్నతో చెబ్తా!" అనేది నేనిచ్చిన జామకాయ తింటూ.

"ఓహో! అవునుగదూ! సుమా వాళ్ల నాన్న యించక్కా టీచరు."

"ఓనూ యింతకీ టీచరు పోస్టు సంగతే మరిచిపోయానేంటి చెప్మా యింతసేపూ... చక్కహా అదే నాకొస్తేనా!"

"ఒరే! వెధవా!"

"అరే నాన్నగారొచ్చారెప్పుడో, గదిముందర నించొని పిలుస్తున్నారు"

"నన్నేనా? ఎహెః! కాదు రవినేమో?"

"ఏం చేస్తున్నావురా? దున్నపోతా!"

"మర్యాదగా పిలవలేరా? ఏంటా పిలుపు? అంత బాధగా ఉంటే చెప్పేయండి, పొయ్యే సన్యాసుల్లోనయినా కలుస్తాను" అందామని ఉంది మనస్సులో.

"పలకవేరా!" అనుమానంగా లోపలికితొంగి చూసారు.

"ఏంటండి?" మెల్లిగా అడిగాను.

"రేపు పరంధామయ్యగారి దగ్గర కెళ్లు. వాళ్లల్లుడి ఆఫీసులో ఏవో ఖాళీలున్నాయట" అంటూ వెనక్కి తిరిగారు.

"ఎవరీ పరంధామయ్య? ఎవరాఅల్లుడు? ఎక్కడా ఆఫీసు? ఎన్ని ఖాళీలు? ఏంటా ఖాళీలు?" గుక్కతిప్పుకోకుండా గబగబా అరిచాను నాన్నగారు యింట్లోంచి బైటికెళ్లడం చూసి.

"కనుక్కొని చెప్తాలేరా బాబూ!" అంది అమ్మ వంటింట్లోంచి.

* * *

"ఇదేనా ఆ యిల్లు...ఏదో నేమ్‌బోర్డున్నట్లుందిగా...పరంధామయ్య, రిటైర్డ్ జడ్జి హా...హా...యిదే...యిదే...లోపలివాళ్లనెట్లా పిలవడం? హమయ్యా కాలింగ్ బెల్లుందిగా... అయినావీట్లన్నమ్మిందెవడు...మోగుతుందో? మోగదో? ఏ వైనా గాని మనకర్తవ్యం నెరవేర్చాలిగా! యిదే గనుక మోగినట్లైతే నాకు తప్పకుండా ఉద్యోగమొస్తుంది. ఆఁ మోగిందే...ఎవరోతలుపుతీస్తున్నట్టున్నారే!"

"అబ్బ ఈనేనా పరంధామయ్య! ఎంత నిరాడంబరంగా ఉన్నాడు? అసలు కొందరికీ ఖద్దరు బట్టలు ఎంతో హుందాని తెచ్చిపెడతాయి."

"నమస్కారమండీ"

"నమస్కారం బాబూ! ఎవరు మీరు?"

"నేను మల్లయ్య గారబ్బాయినండీ"

"హోర్నీ మల్లిగాడి కొడుకువట్రా నువ్వు! చెప్పవేంటి! ఎంతెదిగావురా! రా! రా! లోపటకిరా"

"ఆహా!! నాన్నగారికి ఈయనకీ యింత

## ★ నమ్మా నమ్మకపో ★

★ ఆఫ్రికాలోగల "వెల్‌విట్సియా" మొక్క నూరు సంవత్సరాలు బ్రతుకుతుంది. కాని దాని జీవిత కాలంలో రెండే ఆకులు తొడుగుతుందిట!

★ జిరాఫీకి 18 అంగుళాల పొడవైన నాలుక వుంటుంది అంటారు.

★ మంచి జాతికి చెందిన బ్రహ్మజెముడు మొక్క నాలుగు అంతస్తుల భవనం కన్నా ఎక్కువ ఎత్తుకి పెరుగగలదుట!

★ ప్రపంచంలో అతి సులభంగా జ్ఞాపకం పెట్టుకొనే వూరిపేరు నార్వే దేశంలోగల ఒక గ్రామం – "ఎ"

★ ఒంటెకు మూడు కనురెప్పలు వుంటాయి అంటారు. రెండు ఇసుక ప్రవేశించకుండా వుండడానికి, ఇంకొకటిదుమ్మును తుడిచివేయడానికీనుట!!

★ మనం తుమ్మినపుడు - అది గంటకు నూరుమైళ్ల వేగంతో మన నోటి నుంచి బయటకు వస్తుందిట!

★ కందిరీగలు మనిషికన్నా ముందుగానే కాగితాన్ని కనిపెట్టి గూళ్లు అల్లడం నేర్చుకున్నాయి!

పరిచయముందా! మరి నాన్నగారింత కాలం ఎందు కూరుకొన్నట్లబ్బా!''

''రామయ్యా! ఎవరూ వచ్చింది?'' పక్కగదిలోంచి ప్రశ్న.

''అయ్యా! మా బావమర్ది కొడుకని చెప్పాను కదండీ! ఖమ్మం నించొచ్చాడు.''

క్షణంసేపు నామతి పోయింది.

''వీడికేమన్నా పిచ్చా ఏం! నే ఖమ్మం నించి రావడమేమిటి? అయినా ఈ ముసలాడి పేరు పరంధామయ్య లాగా లేదు కూడాను. ఎందుకైనా మంచిది — అడిగేస్తే సరిపోతుంది.''

''క్షమించాలి! మీ పేరు పరంధామయ్యేనా?''

''ఏడిశావులేరా! నేను పరంధామయ్యగారి గుమాస్తాని—అయినా మీ నాన్నన్నీ విపులంగా రాసాడ్లేరా నాక్కు. విన్నన్నేవంటాడు వెళ్ళి పోయేడు. ఈరోజు నించే వంట పన్లోకి జేరు. ఏంటా బెదురు చూపులు. పద పద పద!''

''ఛీ! వంటచేయాల్ట వంట!'' వాణ్ణి

# లక్షల్లో ఒకడు

చూస్తే నాకసయ్యం పుట్టింది.

''ఏవయ్యా! నన్నెవరనుకున్నావో ఏమో గానీ, నేన్నీబామర్ది కొడుకునూగాదు, ఖమ్మం నించి రానూలేదూ—పరంధామయ్యగారి కోసం వచ్చాను-పొయ్యాయన్తో ఆ విషయం చెప్పు!'' గసిరాను.

విషయం చూచాయగా గ్రహించాడేమో నాకేసి బెదురు చూపులు చూస్తూ గదిలోకి వెళ్ళాడు.

కొంచెం సేపటికి ముతక పంచెతో, చొక్కా కూడా లేకుండా, ముక్కు మీంచి ఎప్పుడు కిందకు దొర్లుదావా? అని ప్రయత్నించే కళ్ళజోడుతో మరొకడు బైట కొచ్చాడు.

''పరంధామయ్యగార్ని పిలవ్వోయ్.''

''ఎవరోయ్నువ్'' ఘర్జించాడు.

''పరంధామయ్యగారు కావాలండీ''కరుస్తాడేమోనని వెనక్కి ఆడుగేస్తూ అన్నాను.

''కనపట్టంలా!''

చుట్టూ చూసాను. ఎవరూ లేరు. ''లేదు'' అన్నాను.

''మంచి కళ్ళ డాక్టరొక డొస్తున్నాడు, నాకు బాగా తెల్సులే...''

''చూపు కాదోయ్ కనపడంది. పరంధామయ్యగారు...'' అతని మాటలు మధ్యలోనే త్రుంచేస్తూ, అసహ్యంగా చూస్తూ అన్నాను.

''యిన్ని మాటలు దేనికి, నేనే పరంధామయ్యను''


మరుక్షణం ఆయన కాళ్ళమీదున్నాను. ఆ సమయంలో నాకు ''ఎంత చదువు చదివినా, లోకజ్ఞానం లేని వారిపని యింతే గదా'' అనిపించింది.

''మల్లయ్య కొడుకువా ఏంటి!'' కళ్ళు చిట్లిస్తూ అనుమానంగా అడిగాడు.

''లేవోయ్! లే! లే! మా అల్లుడొస్తున్నాడ్నీకుద్యోగ మిప్పించేస్తా, లే! లే!''

''చిన్నప్పుడు కురుక్షేత్రంలో దుర్యోధను డేసినట్లున్నాడీన'' అనుకొంటూ వెనక్కి తిరిగాను.

''హార్నీ నువ్వటోయ్! ఎన్నాళ్ళ



చూసాను ! ఏంచేస్తున్నావిప్పుడు ? అయిందా బి. ఏ. ?"

"మీరాండీ ! బి. ఏ. పాసై ఏణ్ణర్ధమైందండీ." అంటూ మా నాన్నగారు నన్ను పంపించిన సంగతి చెప్పాను.

నేను గుంటూరులో బి. ఏ. మొదటి సంవత్సరంలో ఉండగా, ఈయన సి. ఎ. నాల్గో సంవత్సరంలో వున్నాడు. బత్తాయి కాయలు తింటం దగ్గర్నించి, ఛస్పాడుకోడం వరకు కల్సే చేసేవాళ్లం.

"ఐ. ఎ. ఎస్. పాసై కలక్టరవ్వాల్సిన వాడివి నీకేంటోయ్. ఈ కష్టాలు. సరే ! మా ఆఫీసులో ఎల్డిసీ పోస్టులు ఖాళీఉన్నాయి. ప్రస్తుతానికది చెయ్యి. తర్వాత చూద్దాం." అంటూ నిట్టూర్చాడు.

కలక్టరవ్వాల్సిన వాడివన్నందుకో, ఎల్డిసీ పోస్టిస్తానన్నందుకో నా మనసు సంతోషంతో ఉరకలేసింది. ఆయన కార్లోనే ఆఫీసుకు తీసుకెళ్లాడు.

" కూర్చోవోయ్ " అన్నాడాయన తన కెదురుగా ఉన్న కుర్చీ చూపించి.

"థాంక్యూసార్" అంటూ కుర్చీలో కూచున్నాను.

" ఇదుగోనోయ్. ఓ అప్లికేషన్రాయి " అంటూ ఓ తెల్లకాగితం యిచ్చాడు. యింతలో టెలిఫోన్ మోగింది.

"ఎస్సార్ ... ఔన్సార్ ... సరేసార్ ... అట్లాగేసార్ ... తప్పకుండా సార్ ... అది నా అదృష్టం సార్ ... పంపండి సార్ ... ఫర్లేద్సార్..." అవతల ఎవరు మాట్లాడుతున్నారో ? ఏం మాట్లాడుతున్నారో తెలీదు గాని ఈయన జవాబులు మాత్రం యివి.

"సారీనోయ్! ఆ రెండు పోస్టులకీ మినిష్టరుగారి కేండిడేట్లు ఉన్నార్ట అయ్యామెక్స్ట్రీమ్లీ సారీ ! ఈ సారేవన్నా ఖాళీలుంటే తప్పకుండా ట్రై చేస్తా ! అయినా నీ కెందుకోయ్ ఎల్డిసీ పోస్టు. ఐ. ఎ. ఎస్. చెయ్యి. మా లాంటి వాళ్లమే నీ దగ్గర కొస్తాం !" అంటూ లేచాడు.

"వస్తానండీ !" అంటూ లేచి బయటి కొచ్చాను.

"ఉహూ ! ఐ. ఎ. ఎస్. చేస్తే తనే నా దగ్గర కొస్తాట్ట. ఏ మినిష్టర్లో అయితే ఐ. ఎ. ఎస్. లే వస్తారుగా నా దగ్గరికి. బతకలేక ఒకడేడుస్తుంటే, ఉన్న బతుకు చాలక యింకోడేడుపు." నా ఆలోచన్లకి నాకే నవ్వొస్తుంది.

"ఉద్యోగం లేదు ఏంలేదు పో, అంటే పోన్లే మామూలే అనుకొందును. యిదో కొత్తరకం బాధ"

జీవితంలో అప్పుడప్పుడు మరీ ఆశపెట్టి పారిపోయే సంఘటనలు ప్రాప్తిస్తూంటాయి. బి. ఏ. చదివానేగానీ, లోకజ్ఞానం నాకేమాత్రం లేదని యిప్పుడే తెలుస్తుంది.

"అయినా అతనుమాత్రమేం చేస్తాడ్లే, నాకేగనక ఆ ఉద్యోగమిస్తే, ఇహ, తనెళ్ళి యింకో ఉద్యోగ మెతుక్కోవాల్సి వచ్చేట్టు చేస్తాడామంతి ! "

" అన్నయ్యా ! " రవి అరుపు విని యింట్లోకి నడిచాను.

"ఏమైందిరా ! " అడిగిందిఅమ్మ ఆశగా.

అమ్మ ముఖంలోకి చూసిననాకు గొంతులో ఏదో అడ్డం పడ్డట్లు అయింది. ఎంతమంది నిరుద్యోగులు, ఎట్లా యిలాంటి సంఘటన లెదుర్కొంటున్నారో నాకైతే తెలీదు. కాని నాకుమాత్రం ఆ క్షణాన నా తలని తీసుకెళ్ళి వేగంగాపోయే రైలుకింద పెట్టుకోవాలని అనిపించింది.

"అమ్మా ! యిది భారతదేశం ! ఎలక దూరే సందుంటే ఏనుగులే దూరాయి" నాలో నేనే నవ్వుకుంటూ గదిలోకి నడిచాను.

" ఏమయిందిరా ! " అన్నాల దగ్గర నాన్నగారు అడిగారు.

జరిగిందంతా మెల్లిగా, భయంగా చెప్పాను.

"జాన్లే ! మనమొఖంచూసి ఎవడిస్తాడ్లే ఉద్యోగాలు ! " చెయ్యి కడుక్కోని లేచి పోయారు నాన్నగారు.

"ఛీ వెధవా ! యింట్లోంచి బైటకు నడువు" అని నాన్నగారు అనుంటే చిర్నవ్వుతో యింట్లోంచి పోకపోయినా యింత బాధపడే వాణ్ణిమాత్రం కాదు.

"యింత చదువు చదివింది నాన్నగారి తిట్లలోని వాడి గ్రహించడానికే గదా ! " అనిపిస్తుందొక్కోసారి.

"ఎన్నాళ్లురా నాయనా యిట్లా" దీనంగా గొణుక్కుంటుంది అమ్మ. పెరుగన్నం రుచి తెలీకపోయినా, కన్నీళ్లుమాత్రం ఉప్పగా ఉన్నాయి.

ముఖం తుడుచుకుంటూ బైటకొస్తున్న నాకు "ఒరే ! యివ్వాళ మ్యాట్నీకి చెక్కేద్దామా ! " అంటూన్న వేణు మాటలు వినిపించాయి.


వేణు పక్కింటి వాళ్ళబ్బాయనుకొంటా. రవి ఫ్రండు.

"నాదగ్గర పావలాయే ఉందిరా, ఎట్లా మరి ? " రవి ఆకాశంలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు.

"మీ అన్నయ్య నడగరా"

"ఛీ ! వాడా ! వాడికుద్యోగం లేదూ, సజ్జోగం లేదు. ఈ పావలా లాక్కోకుంటే అంతేచాలు. " రవి జవాబు.

గుండెల్లోంచి ఎవరో కత్తితో చీల్చుకొని బైటకొస్తున్నట్లు అనిపించింది. గుండెను చేత్తో పట్టుకుని వెనక్కు తిరిగిన నాకు



కన్నీళ్లతో అమ్మ కనిపించింది!! తెచ్చిపెట్టుకొని చిన్నగానవ్వి గదిలోకి నడిచాను.

"ఆ రోత రగతి చదువుతున్న రవి తెలియకే అనుండొచ్చా మాటలు. నన్ను మాత్రమే అంటున్నానని ఉద్దేశపడి అనుండొచ్చు, కానీ...ఈ దేశంలోని లక్షలాది నిరుద్యోగుల్ని అన్నట్టుకాదా? ఈ దేశాన్ని పరిపాలిస్తున్న మంత్రుల్ని అన్నట్టుకాదా!"

"అసలు ప్రతీ మంత్రినీ పదవిలోకి వచ్చే ముందు ఓ నాలుగు నెలలు ఏ ఆఫీసులోనో గుమాస్తాగా చేయమనాలి. ఆ జీతంతోనే ఆ నాలుగు నెలలూ బతకమనాలి. అప్పుడు ఈ భారతదేశం ఓ నాలుగు సంవత్సరాల్లో బాగు పడుతుంది."



బోర్నియో నుంచి ఒక జర్మన్ ఓడలో అక్రమంగా తీసుకుపోబడిన ఈ కోతి గత మార్చి నుంచీ ఫ్రాంక్‌ఫర్ట్ జంతు ప్రదర్శనశాలలో ఉన్నది. అక్కడ దాన్ని కొనేవారు ఎవరూ లేకపోవడంతో ఆ తస్కరించిన వ్యక్తి తిరిగి దాన్ని బోర్నియో తీసుకువెళ్లడానికి నిర్ణయించుకున్నాడు. ఉరాంగ్ — ఉటాన్ అనబడే జాతికి ఈ చెందిన కోతులు 5,000 దాకా మాత్రం బోర్నియో, సుమత్రాలలో యింకా మిగిలి ఉన్నాయి. ఇవి అంతరించిపోయే ప్రమాదం వుందని జంతు నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

# లక్షల్లో ఒకడు

గదిలో కూచోబుద్ధికాక మళ్లీ బైటికొచ్చిన నేను "నాన్నా రవీ! యింకెప్పుడూ అన్నయ్యనలా అనకురా" అంటూ అమ్మ రవికి రూపాయి యివ్వడం చూసాను.

గబగబా గదిలోకి వచ్చి పాంటూ, షర్టు వేసుకొన్నాను.

"ఇహ, ఈ యింట్లో ఉండలేను" అని నా కర్థమైంది.

"నా దగ్గరున్నది రూపాయిన్నరేననీ, దాంతో మంత్రిగారబ్బాయి కాల్చే సిగిరెట్లు ఓ రెండు కూడా రావనీ నాకు తెల్సు ... నాకున్నది బి. ఏ. డిగ్రీ మాత్రమేననీ, అదెందుకూ పనికిరాదనీ అది ఈ భారతదేశంలో రిషిలాగే వాళ్లలో చాలా మందికి కూడా ఉన్నదనీ" నాకు తెల్సు

"కానీ జీవితంలో ఏదో సాధించగలననే ఆశ నన్ను ముందుకు లాగిందా క్షణాన."

"నాన్నగారి బాధా, అమ్మ ఆప్యాయతా, రవి అమాయకత్వం, పరంధామయ్యగారి అల్లుడి భయం" ఒకొటొకటిగా గుర్తొచ్చాయి.

డబ్బుల్లేని ప్రయాణీకు లేం చేస్తారో నేనూ అదే చెయ్యదలచు కున్నాను. మెల్లిగా రైల్వేస్టేషనుకు నడిచాను.

"ఆకలేస్తుంది. బీదవాడని తెలిస్తే చాలు, ఈ ఆకలికి మహా సరదా! లేకుంటే యింట్లో వెయ్యని ఆకలి రయిల్ స్టేషన్లో ఎందుకు వేస్తుంది? జామకాయల బండీ వైపు నడిచాను.

"రెండు పైసలకు జామకాయ కాదుగదా, రేగిపండు కూడా యివ్వను. ఫో! పొయ్యింకో ఎనిమిది పైసలు అడుక్కొచ్చుకో!" ఓండ్ర పెడుతున్నాడు బండివాడు.

"నాలుగు రోజుల్నించి మంచినీళ్లే తాగుతున్నా బాబయ్యా! ఒక్క చిన్న కాయ యియ్యి!" అంటూ రెండు పైసల్ని యిస్తూ దీనంగా అడుగుతుంది ముసలిది.

"చెప్పు తెగాలా! ఛంపేస్తా! ఫో ఫో!" అరుస్తున్నాడు బండివాడు.

ఆమె రెండు పైసలివ్వకుండా అడుక్కున్నట్లైతే నేనంత బాధపడే వాణ్ణి కాదు— కానీ ఆ రెండు పైసలు యివ్వడంలో ఆమెకు గల ఆత్మాభిమానం తెలుస్తుంది.

అమెరికాలో వివాహానికి ప్రాముఖ్యం దిగజారిపోవుచున్నదని ఒక సర్వే ద్వారా తెలిసింది. ఇది శాశ్వతమైన సూచనా? లేక యుద్ధానంతర మేర్పడిన పరిస్థితుల యొక్క తాత్కాలిక ప్రభావమా అన్నది తేలలేదు. వాటి అర్థమేమైనా, గత సంవత్సరంలో జారీ అయిన వివాహపు లైసెన్సుల సంఖ్యను 1973 సం. వాటితో పోలిస్తే 54 శాతం తగ్గిపోయినట్లు అంచనా!

"జీవితంలో యిలాంటి చిన్న చిన్న సంఘటనలే పెద్ద పెద్ద సత్యాలను తెల్పుతాయేమో! కనీసం అట్లా అనిపించొచ్చు నాలాటి వారికి."

ఏది ఏమైనా యిప్పుడా జామకాయల బండివైపు వచ్చుండకపోతే నేను ఏ మద్రాసో వెళ్లి లక్షలతో తిరిగివచ్చేవాణ్ణో, లేకుంటే ఆకలిబాధ భరించలేక ఆత్మహత్య చేసుకొనే వాడినో చెప్పలేను. కానీ ఆ ముసలావిడను చూసింతర్వాత భారతదేశంలో ఎంతమంది నాకంటే నికృష్టమైన బ్రతుకు బ్రతుకుతున్నారో అర్థమైంది. నేను యింట్లోంచి బైటకుపోతే ఏమాత్రం విలువచేస్తానో తెలిసినట్లయింది. నేను యింట్లోంచి బైటికొచ్చేప్పుడు నాకుకలిగిన ఉత్సాహం, ఉత్సుకత యిప్పుడు ఊదేశినట్లయింది.

"మీకేం కావాలి బాబూ" బండివాడి పిలుపుతో ఈ లోకానికి వచ్చాను. ఆమెను తిట్టిన గొంతుకేనా యిది అనిపించింది.

జేబులోంచి రూపాయిన్నరతీసి, ఆ ముసలిదాని గుప్పిట్లో పెట్టి, యింటివైపు నడిచాను.

"అన్నయ్యొచ్చాడోచ్" అనరిచాడు రవి యింట్లో కదుగు పెట్టగానే.

నాన్నా, అమ్మా గబగబా బైటకొచ్చారు.

అమ్మ నా నోట్లో లడ్డూ పెట్టింది.

"నీకు టీచరుగా పోస్టింగార్డర్సొచ్చాయిరా యివ్వాల్టి పోస్టులో" నాన్నగారు నిర్మలంగా నవ్వుతున్నారు.

సంగతి అర్థమైంది,

ఆ విధంగా ఓ నలుగురు కాబోయే నిరుద్యోగులకు తండ్రినై, కొన్నివందలమంది కాబోయే నిరుద్యోగులకు మాస్టారినై, దేశంలో ఒకనిరుద్యోగిసంఖ్య తగ్గించాను.